క్లుప్తంగా

మేమున్నామని..



నర్సిరెడ్డికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

యాచారం: మండల పరిధిలోని నస్దిక్‌సింగారంలో కొద్ది రోజుల కింద నర్సిరెడ్డికి చెందిన రెండు పాడిఆవులు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీంతో అతడు జీవనోపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అతడితో పాటు చదువకున్న పదో తరగతి (1995–96) బ్యాచ్ విద్యార్థులు.. జయేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, విజయకుమార్, కృష్ణయ్య తదితరులు కలిసి మంగళవారం రూ.లక్ష ఆర్థికసహాయం అందజేశారు. ఆవుల కొనుగోలు కోసం ఈ సహాయం అందజేసినట్లు వారు తెలిపారు. చిన్ననాటి స్నేహితులు తనకు అండగా నిలవడం పట్ల నర్సిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం

మంచాల: తల్లిదండ్రులు చనిపోయి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ దివ్యాంగుడికి రావిరాలకు చెందిన పద్దుబాయ్ అండగా నిలిచాడు. వివరాలు.. మంచాల మండలంలోని చాంద్‌ఖాన్‌గూడకి చెందిన నొసు ప్రవీణ్ దివ్యాంగుడు, అతని చెల్లెలు కూడా దివ్యాంగురాలు. ఇటీవల వారి తల్లిదండ్రులు చనిపోవడంతో వారి యోగక్షేమాలు చూసుకునేవారు లేకుండా పోయారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి గురించి తెలుసుకున్న రావిరాలకు చెందిన పద్దుబాయ్ తనవంతు సహాయంగా నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికసాయం అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ 2024–25 విద్యాసంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఇంటర్, తత్సమాన అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులై తెలంగాణ దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే 94405 71781, 90528 67711, 96185 64824 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హరిహరపురం సీనియర్ సిటిజన్ నాయకులు మంగళవారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో హరిహరపురం కాలనీ వాసులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అందరూ పోలింగ్ రోజున ఉదయాన్నేపోలింగ్ కేంద్రాలకు రావాలని వారు పిలుపునిచ్చారు. ర్యాలీలో రమణ, రఘుపతిరావు, నారాయణరెడ్డి, రవీంద్రకుమార్, వనజాక్షి, వెంకటయ్య, రంగనాథం, రవీందర్‌రావు, సంజీవరావు, విజయభాస్కర్, రవీందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, సంజీవరెడ్డి, కృష్ణ, రాములు, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య హోమం

కందుకూరు: మండలంలోని పులిమామిడిలో నిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం కొంత సమయం భగవంతుడి సేవలో గడపాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థినికి బంగారు పతకాలు



సాధించిన పతకాలు, ప్రశంసా పత్రాలతో భువనశ్రీ

కందుకూరు: తెలంగాణ స్థాయి కిక్ బాక్సింగ్ సబ్ జూనియర్ పోటీల్లో మండల పరిధిలోని సార్లరావులపల్లి మాజీ సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్ కుమార్తె భువనశ్రీ బంగారు పతకాలను కైవసం చేసుకుంది. మహబూబ్‌నగర్‌లో ఇటీవల ముగిసిన రాష్ట్రస్థాయి గ్రేడ్–4 కిక్ బాక్సింగ్ పోటీల్లో రెండు బంగారు, ఒక వెండి పతకంతో పాటు ప్రశంసా పత్రాలను అందుకుంది. త్వరలో పూనెలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, చిన్నారి ప్రస్తుతం హస్తినాపురంలోని శ్రీభవిష్య పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుంది.

గ్రహణం వీడేనా?



మాల్ కూరగాయల మార్కెట్

- నిరుపయోగంగా మాల్ కూరగాయల మార్కెట్
- రోడ్లపైనే కూరగాయలు, చేపల క్రయవిక్రయాలు
- పదిహేనేళ్ల క్రితం రూ.50లక్షలతో దుకాణా సముదాయాల ఏర్పాటు
- మూతపడటంతో ఆదాయం కోల్పోతున్న పంచాయతీ

యాచారం: మాల్ కూరగాయల మార్కెట్‌కు ఇప్పట్లో గ్రహణం వీడేటట్లు లేదు. మార్కెట్‌ను అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు కలిపిస్తే పంచాయతీకియేటా రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశమున్నప్పటికీ పట్టించుకునే వారే లేరు. దీంతో మాల్‌లోని కూరగాయల మార్కెట్ పదేళ్లుగా మూతపడింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్ మార్కెట్‌కు ఎంతో పేరుంది. మూడుజిల్లాల నుంచి రైతులు తమ పొలాల్లో పండించిన కూరగాయలను ఇక్కడి మార్కెట్లో అమ్మకాలు జరిపేవారు. చుట్టుపక్కల పల్లెల్లో ఉండే వందలాది మంది చిరువ్యాపారులు కూడా ఇక్కడి మార్కెట్లో తక్కువ ధరకు లభించే తాజా కూరగాయలను కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లో విక్రయాలు జరిపి ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. మార్కెట్‌ను అభివృద్ధి చేస్తే కొనుగోళ్లు పెరిగి ఎంతోమంది కార్మికులకు ఉపాధి దొరికే అవకాశం ఉంది. అయితే మాల్ మార్కెట్‌లోకి రైతులెవరూ రావడం లేదనే సాకుతో వ్యాపారులు పక్కనే ఉన్న నల్లగొండ జిల్లా పరిధిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

దాదాపు రూ.50లక్షలతో..

మాల్‌లో ఒకేచోట కూరగాయల క్రయ, విక్రయాల కోసం పదిహేనేళ్ల కింద రూ.50 లక్షలు ఖర్చుచేసి దుకాణాలను నిర్మించారు. పలువురు వ్యాపారులకు దుకాణాలు కేటాయించి కూరగాయల క్రయ, విక్రయాలు జరిపే విధంగా అధికారులు సౌకర్యాలు కల్పించారు. అంతకు ముందు వ్యాపారులు రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దులోని ప్రైవేట్ దుకాణాల్లో క్రయ, విక్రయాలు జరిపేవారు. రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బంది, రోడ్డు విస్తరణ వల్ల మాల్‌లోని నల్లవెల్లి చౌరాస్తాలోని ఆర్టీసీకి చెందిన స్థలంలో దుకాణాలను నిర్మించారు. రెండేళ్ల పాటు కూరగాయల మార్కెట్ కొనసాగడంతో స్థానిక రైతులకు కూరగాయల విక్రయాలకు, చిరువ్యాపారుల కొనుగోళ్లతో వ్యాపారులతో పాటు ఎంతోమంది కూలీలు జీవనోపాధి పొందారు. ప్రసుత్తం ఇక్కడి నుంచి వ్యాపారులు తరలిపోయి నల్లగొండ జిల్లా పరిధిలోకి వెళ్లడంతో మాల్‌లోని కూరగాయల మార్కెట్ సముదాయ దుకాణాలు నిరుపయోగంగా మారాయి. ఈ క్రమంలో దాదాపు రూ.5 కోట్ల విలువైన మార్కెట్ సముదాయం స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. ఇరుపక్కల నుంచి మార్కెట్ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. అయితే ఇదే స్థలంలో ఆర్టీసీ బస్టాండ్ కూడా ఉంది. బస్టాండ్ కూడా నిరుపయోగంగా మారడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు.

కలగానే చేపల మార్కెట్..

రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్‌లో చేపల మార్కెట్ ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషి చేశారు. కూరగాయల మార్కెట్ పక్కనే చేపల మార్కెట్‌తో పాటు చికెన్, మటన్ దుకాణాలు ఏర్పాటు చేస్తే.. మార్కెట్‌కు వచ్చేవారు కూరగాయలతో పాటు చేపలు, మటన్, చికెన్ కొనుగోళ్లు చేసే అవకాశం ఉందని అన్నారు. అయితే మాల్‌లో ప్రతి మంగళవారం జరిగే సంతలో నాగార్జునసాగర్ నుంచి వ్యాపారులు చేపలను తెచ్చి విక్రయాలు జరుపుతున్నారు. అయితే ఆయా విక్రయాలు రోడ్డుపైనే జరుగుతుండటంతో అందరికీ ఇబ్బందిగా ఉంది. మాల్‌లో అదే చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సరసమైన ధరలకు చేపలు అందటంతో పాటు పంచాయతీకి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.

ఆదాయం కోల్పోతున్నాం



కూరగాయలను నల్లగొండ జిల్లా పరిధిలోని శ్రీ వెంకటేశ్వర నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి వెళ్లి విక్రయిస్తున్నాం. ఇదివరకు మండల పరిధిలో ఉండటంతో కూరగాయలు వ్యాపారులకు ఇచ్చి సాయంత్రం డబ్బులు తెచ్చుకునేవాళ్లం. ప్రస్తుతం వెంకటేశ్వరనగర్‌లోని మార్కెట్‌లో వాటిని విక్రయించే వరకు అక్కడే ఉండాల్సి వస్తుంది. ఇబ్బందిగా ఉంది. మన ఆదాయం అంతా నల్లగొండ జిల్లా మార్కెట్‌కు తరలిపోతోంది.

– బుచ్చయ్య, రైతు, తమ్మలోనిగూడ

గుర్తింపు లేకుండా పోయింది



ఒకప్పుడు రూ.లక్షల్లో విక్రయాలు జరిపే మాల్ మార్కెట్ బంద్ కావడంతో గుర్తింపు లేకుండా పోయింది. ప్రతీ మంగళవారం పశువుల సంత జరగడంతో మాల్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. అయతే కూరగాయల మార్కెట్ లేకపోవడంతో రైతులెవ్వరు నల్లగొండ జిల్లా పరిధిలోకి కూరగాయల తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. నాడు నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల నుంచి వందలాది క్వింటాళ్ల కూరగాయలను తీసుకెళ్లే వారు.

– పాశ్చ బాషా, రైతు, నక్కర్తమేడిపల్లి

మార్కెట్‌ను తెరిపిస్తాం

లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే అధికారులతో కలిసి మాల్‌లో పర్యటిస్తాను. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మూతపడిన కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించడంతో పాటు చేపల మార్కెట్ ఏర్పాటుకు కూడా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. మాల్‌లో కూరగాయలు, మటన్, చికెన్, చేపల మార్కెట్లు ఒకేచోట ఉంటే కొనుగోలుదారులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. పంచాయతీకి కూడా ఆదాయం వస్తుంది.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

మల్లు రవిని గెలిపించండి

- పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్
- ముమ్మరంగా కాంగ్రెస్ నేతల ప్రచారం



కడ్తాల్: మల్లురవికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో.. రైతులకు త్వరలోనే రుణమాఫీతో పాటు, బీమా సదుపాయం, మహాలక్ష్మీ పథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యానాయక్, నర్సింహ, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, బాల్‌రాజ్, అశోక్, జవహర్, హీరాసింగ్, ఇక్బాల్, రామకృష్ణ, లక్ష్మణ్, రమేష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామల్లో మంగళవారం స్థానిక నేతలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీలను తరిమికొట్టాలన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్స్ జగన్‌గౌడ్, శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామంలో మైనింగ్ కంపెనీ వద్దు

తహసీల్దార్‌కు ముద్విన్ గ్రామస్తుల వినతి

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ శివారులోని సర్వే నంబర్ 95లో వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న నల్లగుట్టపై మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని ముద్విన్ గ్రామస్తులు కోరుతున్నారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ ముంతాజ్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ముద్విన్ గ్రామ సమీపంలో మైనింగ్ క్రషర్ ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని జూలై 2022లో నల్లగుట్ట వద్ద నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అప్పటి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు, జిల్లా మైనింగ్, పొల్యూషన్ కంట్రోలు అధికారులకు వినతిపత్రాలు అందించామని తెలిపారు. గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న నల్లగుట్టపై మైనింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తే గ్రామస్తులతో పాటు సమీప వ్యవసాయ పొలాల రైతులు, వన్యప్రాణులకు ఇబ్బందులు తలెత్తుతాయని.. ఎంతో మంది జీవనోపాధి కోల్పోతారని వివరించడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా రెండునెలల క్రితం కొంతమంది వ్యక్తులు వచ్చి నల్లగుట్ట సమీప రైతులను కలిసి మైనింగ్ చేపట్టడానికి వచ్చామని తెలపడంతో రైతులు ఒక్కసారిగా భయాందోళన చెందారని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం వెంటనే మైనింగ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు నిలిపివేయాలని కోరారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా వ్యవహరిస్తే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య, నాయకులు.. జంగయ్య, మల్లేశ్, శ్రీను, వెంకటయ్య, మహేందర్, రాజు, యాదయ్య, రాములు తదితరులు ఉన్నారు.

నిలువ నీడ కరువు



దుకాణ సముదాయాల వద్ద వేచిఉన్న ప్రయాణికులు

- మాడ్గులలో బస్టాండ్, షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- దుకాణ సముదాయాలు, చెట్ల నీడన కూర్చుంటున్న వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు

మాడ్గుల: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోడ్లపైనే వారు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. 30 గ్రామ పంచాయతీలు ఉన్నా మండల కేంద్రంలో బస్టాండ్ లేక పోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్‌ల వద్ద బస్సులు ఆపకపోవడంతో రోడ్లపై పరుగులు తీయాల్సి వస్తోంది. ఓవైపు ఎండలు ఎండలు ఠారెత్తిస్తుంటే బస్టాండ్, షెల్టర్లు లేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. అత్యవసర సమయాల్లో ప్రయాణం చేయాలనుకునే వారు బస్సుల కోసం మండుటెండలోనే ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించడంతో పాటు అవసరమైన చోట బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెట్ల నీడన నిల్చుంటున్నాం



బస్టాండ్ లేకపోవడంతో ఎండతీవ్రతకు చెట్ల నీడన, దుకాణ సముదాయాల వద్ద నిలబడాల్సి వస్తోంది. మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సంతోష, నల్లవారిపల్లి, మాడ్గుల

బస్ షెల్టర్లు నిర్మించాలి



వేసవి, వర్షాకాలంలో బస్సుల కోసం వేచిఉండే సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రంలో అవసరమైన చోట బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– మనీషా, నల్లచెరువు, మాడ్గుల

10న హక్కుల పరిరక్షణకు సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కందుకూరు: రాజ్యాంగం, రిజర్వేషన్లు, హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 10వ తేదీన టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండు నర్సింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రజాసంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. రిజర్వేషన్లు, మానవ హక్కుల పరిరక్షణ, రాజ్యాంగాన్ని రక్షించుకుని దేశాన్ని కాపాడుకుందామన్నారు. అందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. సమావేశానికి అధిక సంఖ్యలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తిరుపతి, నర్సింహ, కృష్ణ, మల్లేశ్, నర్సింహ, స్వప్న పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- ఆర్‌ఎస్‌పీ, క్యామను గెలిపించండి
- బీఆర్‌ఎస్ నేతల ఇంటింటి ప్రచారం

ఆమనగల్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా మంగళవారం ఆమనగల్ పట్టణంలో ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖలీల్, కోట శ్రీను, యాదగిరి, శ్రీను, ఆనంద్, యాదయ్య తదితరులు ఉన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్(ఆర్‌ఎస్‌పీ)ను భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ కోరారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. అలాగే మండల పరిధిలోని రావిచేడ్‌లో జిల్లా ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, నాయకులు నర్సింహ, రమేష్ యాదవ్, యాదయ్య, వసంత, రవి, సాయికుమార్, మహేశ్, విష్ణు, భాస్కర్, ఈశ్వర్, దేవుల, బ్రహ్మ, మల్లేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించండి..

తుర్కయంజాల్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, బాషా, శ్రీశైలం, వెంకటేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి

- భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్
- బీజేపీలో చేరిన నందివనపర్తి నాయకులు



బూర సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

యాచారం: నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. యాచారం మండల పరిధిలోని నందివనపర్తికి చెందిన పలువురు నాయకులు మంగళవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగికార్ రమేష్ ఆధ్వర్యంలో నగరంలో బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బూర మాట్లాడుతూ... దేశ ప్రజలంతా నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో లక్ష్మారెడ్డి, రవీందర్, మోహన్‌రెడ్డి, రవీంద్రచారి, గణేష్, వెంకటేష్, కృష్ణ తదితరులు ఉన్నాడు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, విజయకుమార్, బ్రహ్మాచారి పండారి తదితరులు పాల్గొన్నారు.

మా మద్దతు బీజేపీకే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ, ఉపకులాలంతా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలపాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ కోరారు. యాచారంలో మంగళవారం బీజేపీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య నేతల సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ తెలంగాణలోని బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారని అన్నారు. మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి ఐతేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, బీజేపీ, ఎమ్మార్పీఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



మంచాల: ఆరుట్ల–బందలేమూర్ రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు



యాచారం ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



ఇబ్రహీంపట్నం: మరమ్మతు పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

వాన.. హైరాన

మంచాల: మంచాల మండలంలోని ఆరుట్లలో గాలివానకు మంగళవారం రాత్రి తాటిచెట్లు కూలి విద్యుత్ సరఫరా వైర్లు తెగిపోయాయి. ఆరుట్ల నుంచి బందలేమూర్ వెళ్లేదారిలో వైర్లు తెగిపోవడంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

వడగళ్ల వాన..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. యాచారంలో అరగంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. గునుగల్, మల్కీజ్‌గూడ, గాండ్లగూడెం, మొగుళ్లవంపు, నక్కరర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో వడగళ్లు కురిసాయి. సాయంత్రం వరకు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందినట్లు అయింది.

ఇబ్రహీంటపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న పలు హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు ఈదురు గాలులకు చిరిగిపోయాయి. ఆయ ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరాఫరాకు ఆటంకం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రావు వర్షం తగ్గిన అనంతరం సిబ్బందితో మరమ్మతులు చేయించి విద్యుత్ పంపిణీని పునరుద్ధరించారు. నెలరోజులుగా భానుడి ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు ఒక్కసారిగా వాతావారణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

పార్కులను అభివృద్ధి చేసింది నేనే..

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ఎల్‌బీనగర్‌లో మరింత అభివృద్ధి జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ పార్కులో వాకర్స్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో తానే అనేక పార్కులను అభివృద్ధి చేశానని తెలిపారు. నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సుమన్‌గౌడ్, అనిల్‌చౌదరి పాల్గొన్నారు.